క్లుప్తంగా

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



రంగంపేటలో వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్

రంగంపేట: వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వడిశలేరు గ్రామానికి చెందిన యువ రైతు నామాల చక్రవర్తి అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద ఎస్‌బీఐ బ్యాంకు సహకారంతో వ్యవసాయ డ్రోన్ కొనుగోలు చేశారు. వ్యవసాయానికి డ్రోన్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని, ఆధునిక విధానాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థి చిన్నాను అభినందిస్తున్న కోరుకొండ ఎంఈఓ కుశలవ దొర

మధురపూడి: జవహర్ నవోదయలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థి నారా చిన్నను ఎంఈఓ కుశలవ దొర శనివారం అభినందించారు. ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభను కనబర్చినట్టు తెలిపారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చిన్న కూడా ఎంపికయ్యాడని, మండలానికి చెందిన వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఐదుగురు కూడా ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

9 మంది వలంటీర్ల రాజీనామా

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన వలంటీర్లు శనివారం రాజీనామ చేశారు. 9 మంది వలంటీర్లు ఎంపీడీఓ కృష్ణప్రసాద్‌కు శనివారం రాజీనామ పత్రాలను అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వాక్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.

నిబంధనల ప్రకారమే పరీక్షలు నిర్వహించాలి

రంగంపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తరగతులు, పరీక్షలు నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ సమ్మెటివ్-2 సంవత్సరాంతపు పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయన్నారు. ఈ పరీక్షలు ఈ నెల 18 వరకూ జరుగుతాయన్నారు. టోఫెల్ పరీక్ష ప్రశ్నాపత్రాలు కూడా సిద్ధం చేశామన్నారు. వేసవిలో రెండో పూట తరగతులు నిర్వహించకూడదని, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేసి చైతన్యపరచాలన్నారు.

కళాశాలకు కుర్చీల వితరణ



డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆఫీస్ చైర్స్‌ను శనివారం అందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు షష్టి పూర్తి మహోత్సవం, పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విలువ చేసే ఐదు ఆఫీస్ కుర్చీలను బహూకరించారు. అదే విధంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కళాశాల అధ్యాపకులు ఎం.సుధామయి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, సుబ్బారావు తదితరులు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ మదీనా, మీనాక్షి, వాణి, అలేఖ్య, వెంకటేష్, ఫణీంద్ర, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అవగాహన

రాజానగరం: క్వాంటమ్ కంప్యూటింగ్‌కు రాబోయే కాలంలో మంచి డిమాండ్ ఉంటుందని, ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఫిజిక్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మంచి పట్టును సాధించేలా దృష్టిని సారించాలని సూచించారు. ఫిజిక్స్‌తోపాటు ఈ కోర్సును కూడా బోధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రీసోర్స్ పర్సన్ శ్రీరామ్ జయసింహ మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి, దాని ప్రాధన్యత, ఉపయోగాల గురించి వివరించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రంగంపేట: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలు చెంతకే వైద్య సేవలు చేరువ చేశారు. నాణ్యమైన ఆరోగ్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది. గ్రామాల్లో ఆరోగ్య సురక్ష సేవలు అందించడానికి రెండు విడతలుగా శిబిరాలు ఏర్పాటుచేస్తుంది. ఇప్పటికే మొదటి విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వేలాది మందికి వైద్యసేవలు అందించగా, ప్రస్తుతం రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యాధికారులతో పాటు కంటి వైద్య నిపుణుడు వైద్య సేవలు అందిస్తున్నారు. అంతే కాకుండా సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లోని ఇంటింటినీ సందర్శించి అవసరమైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రంగంపేట మండలంలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు సాగిన మొదటి విడత ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 9,824 మంది వైద్య సేవలు పొందారు. 114 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెండో విడత వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకు 4,019 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 14 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.



రంగంపేటలో జరిగిన వైద్య శిబిరంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

బీపీ, షుగర్ పరీక్షలు చేశారు



నాకు చాలా ఏళ్లుగా బీపీ, షుగర్ ఉంది. వైద్యాధికారులు మా సచివాలయం వద్ద రెండు సార్లు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో వైద్యాధికారులు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఊళ్లోనే వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉంది.

– బి.శామ్యూల్, రంగంపేట

వైద్య సేవలు బాగున్నాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. వైద్య సేవలు బాగున్నాయి. వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో వ్యయప్రయాసలు తప్పాయి.

– జి.మరియమ్మ, జి.దొంతమూరు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి పేదలకు వైద్య సేవలు అందించాం. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పంపించి శస్త్ర చికిత్సలు చేయించాం. ప్రస్తుతం రెండో విడత నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– బి.వేణుశ్రీలక్ష్మి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రంగంపేట

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయండి



పందలపాకలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రానున్న ఎన్నికల్లో ప్రజలను సమన్వయ పరుస్తూ వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పందలపాకలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయాన్నారు. అందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో మంచి అభిప్రాయం నెలకొందని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి ప్రతి వార్డులో ఇంటింటా ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్



కొంకుదురులో ఎన్నికల ప్రచారంలో కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో ఎన్నికల ప్రచారం

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కారణంగానే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కొంకుదురులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక రామ్ లక్ష్మణ్ బ్యాగ్స్ అండ్ ప్రింటర్స్ కార్మికులను కలిసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతివ్వాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రధానంగా పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూరాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, పీటీసీ కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



చినపాలమూరులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయడంతో పాటు ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని చిన పాలమూరు, దేవస్థానం కాలనీ, సావారం కాలనీ, పాతవూరు ప్రాంతాల్లో ఆమె ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. ప్రతిపక్ష పార్టీలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మళ్లీ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పాలమూరు, అనపర్తి, కుతుకులూరు సర్పంచ్‌లు గుడాల ధనలక్ష్మి, వారా కుమారి, గొల్లు హేమతులసి, ఎంపీటీసీలు అంసూరి పద్మావతి, గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌తో సమైక్యతాభావం



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం రంజాన్ అని, రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి, సమైక్యతాభావానికి ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక బాబానగర్‌లోని ముఖరం మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెలలో చేపట్టే దీక్ష, పుణ్యకార్యాలతో మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసమన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ కొడేటి భీమేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ నాగూర్, పాదూరి డేవిడ్‌రాజు, పడాల కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



రఘుదేవపురం పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్, ఎంఎస్ఓ వందన తెలిపారు. శనివారం చినకొండేపూడి, మిర్తిపాడు, రఘుదేవపురం, సింగవరం, వంగలపూడి, పురుషోత్తపట్నంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని సూర్య రమేష్, వందన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ 15శాతంలోపు తేమ ఉండాలన్నారు. కామన్ రకం ధాన్యం 75 కిలోలు రూ.1,637, క్వింటాళ్లు రూ.2,183, ఏ గ్రేడ్ ధాన్యం 75 కిలోలు రూ 1,652, క్వింటాళ్లు రూ.2,203 ప్రభుత్వ మద్దతు ధర రైతులు అందుకోవచ్చన్నారు. రబీలో పండించే ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం)లు సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు.

విద్యార్థులకు అవార్డులు, సన్మానం



హైదరాబాద్‌లో శ్రీమహతి విద్యార్థులకు అవార్డులు అందిస్తున్న పాటల రచయిత చంద్రబోస్, ఇస్రో సైంటిస్ట్ సతీష్‌రెడ్డి

సీతానగరం: కాటవరంలోని శ్రీమహతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పెండ్యాల సాహితి, ప్రతిపాటి హాస్విలు ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ పాటల రచయిత పి.చంద్రబోస్, ఇస్రో సైంటిస్ట్ బి.సతీష్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు ఒలిపియాడ్ పరీక్షా ఫలితాల్లో ఫోర్త్ ఐఐటీ చదువుతున్న పెండ్యాల సాహితి స్టేట్ నాలుగో ర్యాంకు, డిస్ట్రిక్ట్ ఒకటో ర్యాంకు సాధించిందని, థర్డ్ ఐఐటీ చదువుతున్న ప్రతిపాటి హాస్వి స్టేట్ 4వ ర్యాంకు, డిస్ట్రిక్ట్ ఒకటో ర్యాంకు సాధించారని తెలిపారు. వీరిని ఈనెల 4న హైదరాబాద్‌లో శ్రీసత్యసాయి నిగమాగమమ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్, ఇస్రో సైంటిస్ట్ సతీష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించి, ఘనంగా సత్కరించారని తెలిపారు. వరుసగా ఏడో సారి తమ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు పొందారని ఐఐటీ అకడమిక్ డైరెక్టర్ ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు.

ఓఆర్ఎస్ కౌంటర్ ప్రారంభం



బిక్కవోలులో ఓఆర్ఎస్ కౌంటర్ ప్రారంభించిన ఎంపీడీఓ విజయలక్ష్మి

బిక్కవోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ విజయలక్ష్మి ఓఆర్ఎస్ కౌంటర్ శనివారం ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం, స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద ఓఆర్ఎస్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వడగాల్పులకు గురి కాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లరాదన్నారు. ఎవరైనా డీహైడ్రేషన్‌కు గురైనట్లుగా అనిపిస్తే తాము అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు మంచినీటిలో కలిపి తాగాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భవాని తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపరలో నిత్య పూజలందుకుంటున్న ప్రాచీన వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి హనుమంతచార్యులు ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంటా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

మధురపూడి: ప్రజాస్వామ వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుదం లాంటదని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందర్ అన్నారు. శని వారం కాపవరంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి కాపవరం సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కుశలవ దొర, సుజాత, యూటీఎఫ్ అధ్యక్షుడు షరీఫ్, పీఆర్‌టీయూ నాయకులు రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని సీతానగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాజశ్రీ

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- సీతానగరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

సీతానగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. శనివారం సీతానగరం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆమెకు స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంకీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే ప్రామాణికంగా వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ ప్రచారం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశేషంగా కృషి చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి ప్రయోజనం చేకూర్చిందన్నారు. నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తున్న మన వైఎస్సార్ సీపీకి అందరూ తమ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాలకు వేసి గెలిపించాలని డాక్టర్ రాజశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకె చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, చల్లమళ్ల సుజీరాజు, కోలా శ్రీను, వలవల వల్లీ, తుమ్మ శ్రీను, మట్ట శ్రీను, తోరం బ్రహ్మజీ, బాబు నాగేశ్వరరావు, సలాది వాసు, తోరం పోశయ్య, మట్ట కాపు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



గాడాలలో వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ, జనసేనకు చెందిన శ్రేణులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో ఎస్సీసెల్ మండల కన్వీనర్ పైడిమళ్ల ధనరాజ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 40 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీ యువజనవిభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి గణేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మేనెల 13వ తేదీన జరుగుతున్న ఎన్నికలు ధర్మానికి– అధర్మానికి, విశ్వసనీయతకు, మోసానికి మధ్య జరుగుతున్న యుద్ధం అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధికి సోపానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడికి మనం గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చాటపర్తి దుర్గారావు, పైడిమళ్ల ధనరాజ్, కొండమీద శ్రీను, ఈలి మూర్తి, కొల్లి బుజ్జిపబాబు, మేకల చిన్న, పైడిమళ్ల వీర్రాజు పాల్గొన్నారు.

ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

మధురపూడి: వేసవి ఎండలకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ రాజకుమారి సూచించారు. శనివారం కోరుకొండ అంకాలమ్మ గుడి వద్ద నిర్వహించిన చిన్నారులకు టీకాలు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. వడగాల్పులకు గురవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్దే ఉండి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. చిన్నారులకు టీకాల కార్యక్రమాన్ని వేసవి ఎండల కారణంగా టైమింగ్స్ మార్చినట్టు తెలిపారు. వేసవి కాలం కావడంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, జ్ఞానచంద్ర, ప్రజ్ఞ, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.